త్రీఫేస్ విద్యుత్ లైన్ ఎందుకు వేయరు?

అసిస్టెంట్ లైన్‌మెన్‌ను ప్రశ్నించిన పెనుగోలు కాలనీ వాసులు

అసిస్టెంట్ లైన్‌మెన్‌ను ప్రశ్నిస్తున్న గ్రామస్తులు

వాజేడు, ఫిబ్రవరి 15: తమ గ్రామానికి త్రీ ఫేస్ విద్యుత్ లైన్ వేయకపోవడంపై మండలంలోని నాగారం గ్రామ పంచాయతీ పరిధి పెనుగోలుకాలనీకి చెందిన గిరిజనులు అసిస్టెంట్ లైన్‌మెన్ రాజేందర్‌ను శనివారం నిలదీశారు. జంగాలపల్లి వరకు వేసి దాన్ని ఆనుకొని ఉన్న తమ గ్రామానికి ఎందుకు వేయడం లేదని ప్రశ్నించారు. గతంలో భద్రాచలం ఎమ్మెల్యే నిధులతో విద్యుత్‌లైన్ వేస్తామని సింగిల్ లైన్ మాత్రమే వేస్తున్నారని, అది కూడా నిలిపివేయాలని ఆవేదన వ్యక్తం చేశారు. గుట్టలపై నివసిస్తున్న తాము ప్రభుత్వ సూచనతో 47 కుటుంబాలకుపైగా కిందికి దిగి నివసిస్తూ, ఇంటిపన్నులు కడుతూ కరెంట్ మీటర్లు పెట్టుకుంటున్నామని, గ్రామంలో రాత్రి వీధి దీపాలు వెలగడం లేదని వివరించారు. తమ గ్రామానికి త్రీ ఫేస్ కరెంట్ ఇవ్వకుంటే రాబోయే ఎన్నికల్లో ఓట్లు వేయబోమని చెప్పారు. విద్యుత్ ఏఈ అర్షద్ అహ్మద్‌ను 'నమస్తే తెలంగాణ' ఫోన్‌లో వివరణ కోరగా వాజేడులోని గ్యాస్ గోడౌన్ నుంచి జంగాలపల్లి వరకు త్రీఫేస్ డీటీఆర్ ప్రాంతం వరకు త్రీఫేస్ లైన్ మంజూరవడంతో పనులు మొదలు పెట్టామని, ఆ గ్రామంలో సింగిల్ ఫేస్ డీటీఆర్ ఉందని, ప్రపోజల్ పంపించామని, నిధులు మంజూరైన వెంటనే వేస్తామని తెలిపారు.

కార్మికులకు మెరుగైన వైద్యసేవలు అందించాలి

చికిత్సపొందుతున్న కార్మికులతో మాట్లాడుతున్న సింగరేణి సీ అండ్ ఎండీ బలరాం

భూపాలపల్లి రూరల్, ఫిబ్రవరి 14: సింగరేణి ఆస్పత్రికి వచ్చే కార్మికులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని సింగరేణి సీ అండ్ ఎండీ ఎన్.బలరాం సూచించారు. కార్మిక వైతన్య యాత్రలో భాగంగా శుక్రవారం రాత్రి భూపాలపల్లి సింగరేణి ఏరియా ఆస్పత్రిని సందర్శించారు. క్యాజువలిటీలో ట్రీట్‌మెంట్ పొందుతున్న కార్మికులను వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పురుషుల వార్డులోకి వెళ్లి ఉద్యోగులను పరామర్శించి, వైద్య వసతులపై ఆరా తీశారు. ఐసీయూలో ఉన్న వసతులపై డాక్టర్లను అడిగారు. ఆస్పత్రిలో పనిచేస్తున్న స్టాఫ్ వివరాలు, ఆస్పత్రిలో కల్పించిన వసతులు, మందుల వివరాలు డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. సీఎండీ మాట్లాడుతూ భూపాలపల్లి సింగరేణి ఏరియా ఆస్పత్రిలో ఉన్న సమస్యలను త్వరలో పరిష్కరిస్తానని అన్నారు. భూపాలపల్లి ఏరియా జనరల్ మేనేజర్ ఏ.రాజేశ్వర్‌రెడ్డి, ఆస్పత్రి డాక్టర్లు గోపి, హరిప్రసాద్ పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ భూమిని పరిరక్షించాలి

ములుగు రూరల్, ఫిబ్రవరి 15: మండలంలోని జాకారం గ్రామ పంచాయతీ భూమిని కబ్జాదారుల నుంచి పరిరక్షించాలని మాజీ సర్పంచ్ దాసరి రమేశ్ శనివారం ఒక ప్రకటనలో అధికారులను కోరారు. గత పాలకవర్గం ఆ భూమిలో షెటర్లు నిర్మించి వ్యాపారం సంస్థలకు కిరాయి ఇవ్వాలని తీర్మానం చేయగా, హైవే వెడల్పు పనులు పూర్తయిన తర్వాత ఇద్దామనుకోగా సర్పంచ్‌ల పదవీ కాలం ముగిసి ప్రభుత్వం మారిందని తెలిపారు. కాంగ్రెస్ నాయకుల కళ్లు ఆ భూమిపై పడ్డాయని పేర్కొన్నారు. 2024 డిసెంబర్‌లో ప్రజావాణిలో కలెక్టర్‌కు విన్నవించగా పరిశీలిస్తామన్నట్లు తెలిపారు. జనవరిలో షెడ్ నిర్మిస్తుండగా రెండోసారి ప్రజావాణిలో ఫిర్యాదు చేయడంతో పరిశీలించాలని కలెక్టర్ ఆర్డీవోను ఆదేశించగా పనులు తాత్కాలికంగా నిలిపివేయించినట్లు తెలిపారు. మళ్లీ ఈనెల 14వ తేదీన రాత్రి పునాది నిర్మించారని పేర్కొన్నారు. జీపీ కార్యదర్శికి ఫిర్యాదు చేస్తే వారు మంత్రి లెటర్ ఇచ్చారని, ఎవరికి చెప్పుకుంటారో చెప్పుకోపో అని బెదిరించారని పేర్కొన్నారు. ఈ విషయాన్ని ఆర్డీవో దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. అధికారులు స్పందించి ఆ భూమిని కాపాడకుంటే ఆందోళనకు దిగుతామని వివరించారు.

గోవిందరావుపేట: పస్రాలో పాల్గొన్న లంబాడ నాయకులు

కాటారం: నివాళులు అర్పిస్తున్న నాయకులు

ములుగు రూరల్: పూజలు చేస్తున్న బంజారా నాయకులు

సేవాలాల్‌కు ఘన నివాళి

జిల్లా వ్యాప్తంగా జయంతి వేడుకలు

భూపాలపల్లి రూరల్, ఫిబ్రవరి 15: బంజారాల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలు శనివారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా జరిగాయి. జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి, వరంగల్ జడ్పీ మాజీ చైర్‌పర్సన్, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి హాజరయ్యారు. సంత్ సేవాలాల్ మహారాజ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

ప్రతి ఒక్కరూ మూడు మొక్కలు నాటాలి

ఈనెల 17న తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ బర్త్ డే సందర్భంగా గ్రీన్ ఇండియా చాలెంజ్ కార్యక్రమంలో భాగంగా జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయం ఆవరణలో మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి, వరంగల్ జడ్పీ మాజీ చైర్‌పర్సన్, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి మొక్కలు నాటారు. వారు మాట్లాడుతూ కేసీఆర్ పుట్టినరోజు సందర్భంగా ప్రతి ఒక్కరూ మూడు మొక్కలు నాటి కానుకగా వృక్షార్చన చేయాలని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ పార్టీ పట్టణ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



భూపాలపల్లి రూరల్: సేవాలాల్ మహారాజ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి

పస్రా గ్రామంలో..

గోవిందరావుపేట: మండలంలోని పస్రాలో భూక్య సుమలత, సక్రునాయక్‌ల ఇంటి వద్ద శనివారం సేవాలాల్ మహారాజ్ జయంతి ఘనంగా నిర్వహించారు. టిస్టా జిల్లా అధ్యక్షుడు భూక్య సక్రునాయక్ మాట్లాడుతూ సేవాలాల్ మార్గాన్ని ఆదర్శంగా తీసుకొని వారి బాటలో నడవాలని అన్నారు. లంబాడీల సాంస్కృతి సంప్రదాయాల నడుమ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎల్‌హెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు సీతారాంనాయక్, మండల అధ్యక్షుడు నర్సింహానాయక్, పీఏసీఎస్ చైర్మన్ పన్నాల ఎల్లారెడ్డి, పాలడుగు వెంకటకృష్ణ, వెంకన్న, సోమయ్య, చంద్రకాంత్, కొర్ర రఘురామ్, దేవా, జోగా ఉన్నారు.

కాటారంలో..

కాటారం: మండలకేంద్రంలోని గిరిజన గురుకుల బాలుర పాఠశాల, బంజారా సేవా సంఘం ఆధ్వర్యంలో మండల పరిషత్ కార్యాలయంలో వేర్వేరుగా శనివారం సేవాలాల్ జయంతోత్సవం నిర్వహించారు. సేవాలాల్ మహారాజ్ చిత్రపటానికి పూలమాలలు వేసి కేక్ కట్ చేశారు. బోగ్ బండార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రిన్సిపాల్ రాజేందర్, సంఘ బాధ్యులు రవీందర్, రాములు, కిషన్, దేవ్, రాజు, రమేశ్‌నాయక్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ములుగు, దేవగిరిపట్నంలో..

ములుగు రూరల్: జిల్లా కేంద్రంతోపాటు దేవగిరిపట్నంలోని సేవాలాల్ మహరాజ్ ఆలయాల్లో జయంతి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. బంజారా నాయకులు కుటుంబ సమేతంగా సేవాలాల్‌కు మొక్కులు చెల్లించి ఆచార సంప్రదాయాల ప్రకారం పూజలు చేశారు. దేవగిరిపట్నంలో జరిగిన వేడుకల్లో మాజీ ఎంపీ ప్రొఫెసర్ సీతారాంనాయక్ హాజరయ్యారు.

అడవికి నిప్పు.. జీవరాశుల మనుగడకు ముప్పు

అవగాహన కల్పించిన ఫారెస్ట్ అధికారులు

వాజేడు, ఫిబ్రవరి 15: అడవికి నిప్పుపెడితే జీవరాశులకు కలిగే ముప్పుపై మండలంలోని చెరుకూరు అటవీశాఖ బీట్ పరిధి ముల్కనపల్లి, పూసూరు బీట్ పరిధి పూసూరు, మండపాక గ్రామాల్లో శనివారం సెక్షన్ ఆఫీసర్లు నారాయణ, నాగమణి ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. అడవి జంతువులను వేటాడటం చట్టరీత్యా నేరమని చెప్పారు. చీపుర్లు, ఇప్పపువ్వు సేకరణ, బీడీ ఆకుల కోసం కొమ్మ కొట్టే సమయంలో అడవిలో నిప్పు పెట్టొద్దని సూచించారు. బీట్ ఆఫీసర్స్ పద్మ, సాయిచరణ్, బేస్‌క్యాంపు సిబ్బంది పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న సెక్షన్ ఆఫీసర్ నారాయణ

ఘనంగా సింగరేణి పాఠశాల వార్షికోత్సవం

జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎడ్యుకేషనల్ సెక్రటరీ గుండా శ్రీనివాస్

భూపాలపల్లి రూరల్, ఫిబ్రవరి 15: భూపాలపల్లి పట్టణంలోని సింగరేణి ఉన్నత పాఠశాలలో 21వ వార్షికోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎడ్యుకేషనల్ సెక్రటరీ గుండా శ్రీనివాస్, కరస్పాండెంట్ కావూరి మారుతి, గెస్ట్ ఆఫ్ ఆనర్‌గా శ్రీదేవీ శ్రీనివాస్ హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సింగరేణి పాఠశాలలో చదువుకున్న విద్యార్థులు ఎందరో ఉన్నత శిఖరాలకు ఎదిగారని తెలిపారు. పదో తరగతి వార్షిక ఫలితాల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. విద్యార్థులకు బహుమతులు అందజేశారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతో అలరించాయి. పాఠశాల ప్రధానోపాధ్యాయులు సీహెచ్ ఝాన్సీరాణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నియామకపత్రం అందజేస్తున్న మండల అధ్యక్షుడు రవి

బీఆర్ఎస్ గ్రామ కమిటీ ఎన్నిక

టేకుమట్ల, ఫిబ్రవరి 15: మండలంలోని రాఘవరెడ్డిపేట బీఆర్ఎస్ గ్రామ కమిటీ ఎన్నుకున్నట్లు మండల అధ్యక్షుడు సట్ల రవి తెలిపారు. అధ్యక్షుడిగా గొల్లపల్లి రఘుపతి, ఉపాధ్యక్షుడిగా ఫణి రాజేశం, ప్రధాన కార్యదర్శిగా చింతలపల్లి తిరుపతి, సహాయ కార్యదర్శిగా బొద్దిరెడ్డి కొండల్‌రెడ్డి, కోశాధికారిగా కొత్తూరి మనోహర్, సలహాదారుగా చదువు మహేందర్‌రెడ్డి, గౌరవ అధ్యక్షుడిగా పసరుగొండ లక్ష్మణ్, ఓసీ సెల్ అధ్యక్షుడిగా తుమ్మేటి రాజు, బీసీ సెల్ అధ్యక్షుడిగా గొల్లపల్లి సురేష్, ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా జిడి వంశీ, ఇతర కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నట్లు వివరించారు. మండల ప్రధాన కార్యదర్శి ఆకునూరి తిరుపతి, బందెల నరేష్,, పింగిళి వెంకటేశ్వర్‌రెడ్డి, ఆది రఘు, పోతనవేణి ఐలయ్య, ఉద్దమారి మహేష్, పొన్నం చంద్రయ్య, ఉమేందర్‌రావు, గువ్వాడి శివ, లక్ష్మణ్ పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల తుది జాబితా ప్రదర్శన

తుది జాబితా ప్రదర్శిస్తున్న ఎంపీడీవో

కాటారం, ఫిబ్రవరి 15: రానున్న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ కేంద్రాల తుది జాబితాను మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ప్రదర్శించారు. మండలంలో 11 ప్రాదేశిక నియోజకవర్గాలకు 57 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు ఎంపీడీవో బాబు, ఎంపీవో వీర స్వామి తెలిపారు. పంచాయతీ కార్యదర్శి షఫీర్‌ఖాన్ పాల్గొన్నారు.

వన్యప్రాణులను వేటాడితే కఠిన చర్యలు

కాటారం, ఫిబ్రవరి 15: అటవీ ప్రాంతంలో ఉచ్చులు బిగించి వన్యప్రాణులను వేటాడితే కఠినచర్యలు తీసుకుంటామని ఎఫ్‌ఆర్వో స్వాతి, కాటారం ఎస్సై అభినవ్ హెచ్చరించారు. గతంలో వన్యప్రాణుల వేటతో సంబంధం ఉన్న గుండ్రాత్‌పల్లికి చెందిన నలుగురిని తహసీల్దార్ నాగరాజు ఎదుట బైండోవర్ చేశారు. వారికి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కౌన్సెలింగ్ ఇచ్చారు. పొలాల చుట్టూ, అడవిలో వన్యప్రాణుల కోసం విద్యుత్ ఉచ్చులు పెడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎఫ్ఎస్‌వో చంద్రశేఖర్, ఎఫ్‌బీవో రాజ్‌కుమార్ ఉన్నారు.

బీమా చెక్కు అందజేస్తున్న పీఏసీఎస్ చైర్మన్ ప్రశాంత్, అధికారులు

బీమా చెక్కు అందజేత

కాటారం, ఫిబ్రవరి 15: గంగారం గ్రామానికి చెందిన బొల్లం గణపతి కుటుంబసభ్యులకు రూ.లక్ష బీమా చెక్కును పీఏసీఎస్ చైర్మన్ తోటపల్లి ప్రశాంత్ శనివారం అందజేశారు. గణపతి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో పంట రుణం తీసుకోగా అతడి పేర సంఘం తరపున బీమా చేయించారు. కొన్ని రోజుల క్రితం గణపతి ప్రమాదవశాత్తు మృతిచెందగా మంజూరైన బీమా రూ.లక్ష చెక్కును కుటుంబసభ్యులకు అందజేశారు. పీఏసీఎస్ డైరెక్టర్ వేమునూరి ప్రభాకర్‌రెడ్డి, సీఈవో ఎడ్ల సతీష్, కేడీసీసీ బ్యాంక్ మేనేజర్ హరిరామ్‌నాయక్, సూపర్‌వైజర్ రాజిరెడ్డి పాల్గొన్నారు.

మిత్రుడి కుటుంబానికి ఆర్థికసాయం

ములుగు రూరల్, ఫిబ్రవరి 15: మల్లంపల్లి మండల కేంద్రానికి చెందిన స్వామి కొన్నేళ్ల క్రితం అనారోగ్యంతో మృతిచెందగా, 2004-2005 విద్యా సంవత్సరంలో అతడితో కలిసి పదో తరగతి చదువుకున్న విద్యార్థులు బాధిత కుటుంబాన్ని శనివారం పరామర్శించి రూ.22వేల ఆర్థికసాయం అందజేశారు. సునిల్, నరేశ్, కంచం కుమార్, సతీశ్, పూర్ణచారి, సలీంపాషా, శ్రీమాత, నాగరాజు, శేఖర్, రాజేందర్, శివ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేస్తున్న తోటి మిత్రులు

రామప్పలో విద్యార్థులకు చికెన్ బిర్యానీ

సిబ్బంది అడ్డుచెప్పడంతో బయటకు తీసుకెళ్లిన ఉపాధ్యాయులు

వెంకటాపూర్, ఫిబ్రవరి 15: మండలంలోని పవిత్ర శివాలయమైన రామప్ప ప్రాంగణంలో ఉపాధ్యాయులు విద్యార్థులకు చికెన్ బిర్యానీ పెట్టిన ఘటన శనివారం జరిగింది. జనగామ జిల్లా తరిగొప్పుల పాఠశాల విద్యార్థులను ఉపాధ్యాయులు విహారయాత్రలో భాగంగా రామప్ప దేవాలయానికి తీసుకువచ్చారు. ఆలయ సందర్శన తర్వాత విద్యార్థులకు గార్డెన్ ప్రాంగణంలో చికెన్ బిర్యానీ ప్యాకెట్లు అందించగా గార్డెన్‌లో తింటున్నారు. గమనించిన పలువురు అభ్యంతరం తెలుపుతుండగా ఆలయ సిబ్బంది చూసి అక్కడి నుంచి పంపేశారు. దీంతో ఉపాధ్యాయులు గేటు బయట కూర్చోబెట్టి తినిపించారు. గత ఏడాది హనుమకొండకు చెందిన ఓ ప్రైవేట్ పాఠశాల విద్యార్థులకు చికెన్ బిర్యానీ పెట్టిన విషయం మరువకముందే మళ్లీ అలాంటి ఘటన జరగడంతో భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రామప్ప గార్డెన్‌లో బిర్యానీ తింటున్న విద్యార్థులు

'పీఎం శ్రీ' పాఠశాలల్లో పనులు పూర్తి చేయాలి

భూపాలపల్లి రూరల్, ఫిబ్రవరి 15: పీఎంశ్రీ పథకానికి ఎంపిక చేసిన పాఠశాలల్లో సౌకర్యాల కల్పనకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ రాహుల్‌శర్మ విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఎంఈఓలు, అధికారులతో పలు అంశాలపై శనివారం ఐడీఓసీలో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ పీఎంశ్రీ పథకం కింద టీఎస్ ఎంఎస్ మల్హర్, జడ్పీహెచ్ఎస్ టేకుమట్ల, కాళేశ్వరం, గొల్లబుద్దారం, చెల్పూర్, టీఎస్ డబ్ల్యూఆర్ఈఎస్ చిట్యాల, టీఎస్ ఎంఎస్ గణపురం, ఎంపీపీఎస్ యామన్‌పల్లి పాఠశాలలు ఎంపిక చేసినట్లు తెలిపారు. ఆయా పాఠశాలలకు రూ.73,76,640 నిధులు మంజూరు కాగా, రూ.49,29,356 మాత్రమే ఖర్చు చేశారని, మిగతా నిధుల్లో నిర్దేశించిన పనులు సత్వరమే పూర్తి చేయాలని ఆదేశించారు. కిచెన్ గార్డెన్స్, కంపోస్టు, స్వచ్ఛత కార్యక్రమాలు, సోలార్ విద్యుత్తు, గ్రీన్ పాఠశాలలు, ఏకో పార్కు ఏర్పాటు చేయాలని, చారిత్రక ప్రాంతాలకు విద్యార్థులను తీసుకుపోవాలన్నారు. డీఎస్సీ 2008లో ఎంపికైన అభ్యర్థులు జిల్లాలో 43 మంది విద్యార్థతలు పరిశీలించి, పకడ్బందీగా నియామకాలు చేపట్టాలని సూచించారు. విద్యార్థుల నమోదు అపార్ ప్రక్రియ 58శాతం పూర్తయ్యిందని, మిగతా శాతం పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లా విద్యా శాఖ అధికారి రాజేందర్, ఎఫ్ఏవో కార్తీక్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్ శర్మ

సమ్మక్క బరాజ్ గేట్లు బంద్

కన్నాయిగూడెం, ఫిబ్రవరి 15: మండలంలోని తుపాకులగూడెం సమ్మక్క బరాజ్ వద్ద గోదావరి నీటి మట్టం తగ్గుతుండగా గేట్లు బంద్ చేసి నీటిని నిల్వ చేస్తున్నారు. శనివారం బరాజ్‌లోకి 2500 క్యూసెక్కుల వరదనీరు వస్తున్నట్లు, బరాజ్ వద్ద గోదావరి నీటిమట్టం 79 మీటర్ల దిగువకు చేరుకోవడంతో అన్ని గేట్లను బంద్ చేసి నీటిని నిల్వ చేస్తున్నట్లు నీటిపారుదల శాఖ అధికారులు తెలిపారు. ఎగువన ఉన్న దేవాదుల ఎత్తిపోతల ప్రాజెక్టులోని ఐదు మోటర్లతో నీటి పంపింగ్ కొనసాగుతోంది. ఫేస్-2లోని ఒకటి, ఫేస్-3లోని నాలుగు మోటర్ల ద్వారా రోజూ 1,414 క్యూసెక్కుల నీటిని భీంఘనపురం రిజర్వాయర్‌లోకి తరలిస్తున్నట్లు డీఈ శరత్, ఎఈఈ సాయిరాం తెలిపారు.

అదనంగా వసూలు చేస్తే కఠిన చర్యలు

భూపాలపల్లి రూరల్, ఫిబ్రవరి 15: మండలంలోని మీసేవ సెంటర్లలో నిర్ధారించిన రుసుము కంటే ఎక్కువ తీసుకుంటే తమకు ఫిర్యాదు చేయాలని తహసీల్దార్ శ్రీనివాసులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మీసేవ సెంటర్లలో అదనపు చార్జీలు వసూలు చేసినా, పౌరులకు అసంతృప్తికరమైన సేవలు అందించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

పోచమ్మ గుడి తొలగించొద్దని వినతి

ములుగు రూరల్, ఫిబ్రవరి 15: జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఉన్న పోచమ్మ గుడిని అభివృద్ధి పేరుతో కూల్చేయొద్దని కలెక్టర్ టీఎస్ దివాకరకు శనివారం గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. ఎరువ పూర్ణచందర్, నేరెళ్ల శంకర్, రేసోజు శ్రీధర్, బోలి రమేశ్, కూన సదర్శన్, ఎల్కతుర్తి శ్రీహరి, గాదం కుమార్, యాసం రవికుమార్, ఎల్కతుర్తి రాజన్న మాట్లాడుతూ పోచమ్మ తల్లి గుడి ఊరు పుట్టినప్పటి నుంచి ఉందని తెలిపారు.

యాకన్నగూడెం బ్రిడ్జి వద్ద ట్రాఫిక్ జామ్

ఇబ్బందులు పడ్డ ప్రయాణికులు

బస్సు వద్ద వేచి ఉన్న ఉద్యోగులు

వెంకటాపురం(నూగూరు), ఫిబ్రవరి 15: మండలంలోని యాకన్నగూడెం వద్ద శనివారం ట్రాఫిక్ జామ్‌తో ఆర్టీసీ బస్సులో వెళ్లిన ఉద్యోగులు, ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. యాకన్నగూడెం బ్రిడ్జి కుంగిపోగా, పక్కన తాత్కాలికంగా రోడ్డు ఏర్పాటు చేశారు. శనివారం ఇసుక లారీ టైర్ పంచరై మధ్యలో నిలిచింది. దీంతో ట్రాఫిక్ జామ్ ఏర్పడి ఆర్టీసీ బస్సులో వెళ్లిన వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, ఉపాధ్యాయులు, ప్రయాణికులు అవస్థలు పడ్డారు. ప్రభుత్వ ఉద్యోగులు సమయానికి విధులకు హాజరు కాలేకపోయారు. బ్రిడ్జి కుంగిపోయి రెండు నెలలు దాటుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు చేరుకొని ఇసుక లారీని బయటకు తీసి రాకపోకలు పునరుద్ధరించారు.

దేవతల వనప్రవేశం

ఏటూరునాగారం/ కన్నాయిగూడెం, ఫిబ్రవరి 15: ఏటూరునాగారం మండలం కొండాయిలో గద్దెలపై కొలువుదీరిన గోవిందరాజులు, సారలమ్మ, నాగులమ్మ వనప్రవేశం ఘనంగా జరిగింది. ఈనెల 12వ తేదీ నుంచి కొండాయిలో జాతర ప్రారంభమైంది. దొడ్ల నుంచి సారలమ్మ, అదే గ్రామంలోని దేవరగుట్ట నుంచి గోవిందరాజులు, నాగులమ్మను తీసుకువచ్చి గద్దెలపై ప్రతిష్ఠించారు. రెండు రోజులపాటు మొక్కులు అందుకోగా శనివారం సాయంత్రం వనప్రవేశం చేశారు. పూజారులు దబ్బగట్ల గోవర్ధన్, రాజారాం, రఘు, విష్ణు ఉదయం గద్దెల వద్ద భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. అక్కడి నుంచి డోలు వాయిద్యాల నడుమ దేవతల వన ప్రవేశం చేపట్టారు. దీంతో నాలుగు రోజుల పాటు జరిగిన జాతర శనివారం ముగిసింది. కాగా, కన్నాయిగూడెం మండలం ఐలాపూర్ సమ్మక్క - సారలమ్మ జాతర శనివారం సమ్మక్క వనప్రవేశంతో ముగిసింది. ముందుగా సారలమ్మను ఐలాపూర్‌లో గద్దెపై ప్రతిష్ఠాపన చేసిన పూజారులు, వడ్డెలు నాలుగురోజులు ఉండి జాతర ముగియడంతో తిరిగి సర్వాయికి చేర్చారు. సమ్మక్కను ఐలాపూర్‌కు చెందిన పూజారులు, వడ్డెలు అట్టహాసంగా గొంతెమ్మ గుట్ట అడవి ప్రాంతానికి సాగనంపడంతో జాతర ముగిసింది.

ముగిసిన మినీ జాతర

- మేడారానికి భారీగా తరలివచ్చిన భక్తులు
- తల్లులకు ఎత్తు బంగారం, పసుపు కుంకుమల సమర్పణ

గద్దెల వద్ద భక్తుల సందడి

తాడ్వాయి, ఫిబ్రవరి 15: మేడారం మినీ జాతర శనివారంతో ముగిసింది. ఈనెల 12న మండమలిగే పండుగతో పూజారులు జాతరను ప్రారంభించారు. సమ్మక్క-సారక్క మందిరాలను శుద్ధి చేసి ప్రత్యేక పూజలు చేశారు. దీంతో బుధ, గురు, శుక్రవారాల్లో గద్దెల ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. శనివారం జాతర ముగుస్తుండడంతో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. జంపన్న వాగులో పుణ్యస్నానాలు ఆచరించి గద్దెల వద్దకు చేరుకున్నారు. సమ్మక్క-సారక్క, గోవింద రాజు, పగిడిద్దరాజుల గద్దెలపై నిలువెత్తు బంగారంతో పాటు పసుపు, కుంకుమలు ఉంచి గిరిజన సంప్రదాయాలతో పూజలు చేశారు. వచ్చే బుధవారం తిరుగువారం పండుగ నిర్వహించి పూజా సామగ్రిని శుద్ధి చేసి మందిరాల్లో భద్రపరుస్తారు. అదే రోజు పూజారుల కుటుంబాలు వన భోజనాలకు తరలివెళ్లనున్నారు.

ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

ములుగు రూరల్, ఫిబ్రవరి 15: కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయాలని అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర నాయకులు బొమ్మెడ సాంబయ్య, కుర్రి అయిలయ్య డిమాండ్ చేశారు. శనివారం ములుగు జిల్లా కేంద్రంలో ఈనెల 20న నిర్వహించే చలో హైదరాబాద్ కార్యక్రమ పోస్టర్లు ఆవిష్కరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 14నెలలు గడిచినా హామీలు నెరవేర్చలేదన్నారు. రైతుభరోసా పథకం కింద రూ.15వేలు ఇస్తామని చెప్పి రూ.12వేలకు పరిమితం చేసిందని చెప్పారు. ప్రొఫెసర్ హరగోపాల్, ప్రగశీల మహిళా సంఘం పీడీడబ్ల్యూ సంధ్యతోపాటు విప్లవ సంస్థ నాయకులు, కార్యకర్తలపై కుట్ర కేసులు మోపుతోందన్నారు. జిల్లాలో ఎన్‌కౌంటర్లు కొనసాగుతూనే ఉన్నాయన్నారు. ఈ నియంతృత్వ ఫాసిస్టు విధానానికి స్వస్తి చెప్పాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 20వ తేదీన చేపట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని ప్రజలు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. నాయకులు ఈశ్వరక్క, రమ, సుధాకర్‌రెడ్డి, శ్రీకాంత్, చిరంజీవి, దాసు పాల్గొన్నారు.

నాణ్యత లేని పనులకు బిల్లులు నిలిపివేయాలి

వాజేడు, ఫిబ్రవరి 15: మండలంలో నాణ్యత ప్రమాణాలు పాటించకుండా చేపట్టి అసంపూర్తిగా ఉన్న పనులకు బిల్లుల చెల్లింపు నిలిపివేయాలని కోరుతూ తెలంగాణ ఆదివాసీ సంఘం నాయకులు జెజ్జరి దామోదర్‌రావు, బచ్చల కృష్ణబాబు శనివారం ఎంపీడీవో విజయ, తహసీల్దార్ శ్రీరాముల శ్రీనివాస్‌కు వేర్వేరుగా వినతిపత్రాలు అందజేశారు. ఆయన మాట్లాడుతూ 2022 నుంచి 2024 వరకు పలు అభివృద్ధి పనులు చేపట్టగా కాంట్రాక్టర్లు నాణ్యత ప్రమాణాలు పాటించలేదని ఆరోపించారు. ఆయా పనులు క్షేత్రస్థాయిలో పరిశీలించి పనులు పూర్తయిన వాటికి మాత్రమే బిల్లులు చెల్లించాలని కోరారు.

వెంకటాపూర్‌లో సామాజిక తనిఖీ

వెంకటాపూర్, ఫిబ్రవరి 15: ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో శనివారం ఉపాధిహామీ సామాజిక తనిఖీ నిర్వహించారు. మండలంలో ఏప్రిల్ 2023 నుంచి మార్చి 2024 వరకు సుమారు 272 పనులు చేసిన కూలీలకు రూ.2కోట్ల చెల్లించగా, అందులో 26,832 రికవరీ చేసినట్లు తెలిపారు. సామాజిక తనిఖీ బృందం వారం రోజులుగా గ్ర